క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : మండలంలోని బంగారుపేట, మహబూబ్‌నగర్, ముమ్మడిగుంటపల్లె, మిట్ట పల్లె గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఎంఈఓ శంకరయ్య తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారంతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతేగాకుండా బాలికలకు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మే డేను జయప్రదం చేసుకుందాం

రాజంపేట రూరల్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని జయప్రదం చేసుకుందామని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాయుడులు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అంతటా జెండాలు ఎగరవేసి 137వ మే డే వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, బ్రహ్మంతోపాటు నాయకులు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త కోడూరు గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్త కోడూరులో వెలసిన గంగమ్మకు శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

పుల్లంపేట : మండల పరిధిలోని పుత్తనవారిపల్లి సమీపాన పేకాటస్థావరంపై ఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించి నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1030లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ సుబ్బారెడ్డి మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా సహించేది లేదని హెచ్చరించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కె.లత

రాజంపేట : మే 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి ఫుల్ అడిషనల్ ఇన్‌చార్జి కె.లత అన్నారు. శుక్రవారం నందలూరు జూనియర్ సివిల్ జడ్జిలో రాజంపేట కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయలోక్ అదాలత్ ద్వారా రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి ప్రతి రోజు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్‌ను నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐలు నరసింహరావు, పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఎర్రచెరువుపల్లె దళితవాడలో శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో మేడా విజయశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చింతలకుంట యానాదిరెడ్డి, వేణుగోపాల్, తిప్పన పెంచలయ్య, రామచంద్ర. ఇరువురి సుధాకర్, రమేష్, నాగయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో ట్యాలీలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్/ఫెయిల్ అయి 18–26 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో ఉచిత శిక్షణ, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 90004 87423 లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ
ఎం.వి. రామచంద్రారెడ్డి



సిద్దవటం: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సిద్దవటం : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ సాయి హైస్కూల్ 15వ వార్షికోత్సవంలో గురువారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్షికోత్సవం వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్కూల్స్ కంటే దీటుగా ఇక్కడి పాఠశాలలు ఉన్నాయన్నారు. శ్రీ సాయి హైస్కూల్ కరస్పాండెంటు పోలు వెంకటసుబ్బయ్య, హెచ్ఎం, రేవతిలు ఎంతో పట్టుదలతో విద్యార్థులకు బోధనను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎంఈఓ శంకరయ్య, ఎస్ఐ తులసీ నాగప్రసాద్, కడపకు చెందిన మహిళా వైద్యురాలు డాక్టర్ శకుంతల, అపుస్మా స్టేట్ ప్రెసిడెంటు క్రిష్టారెడ్డి, కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, హెచ్ఎం రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

రామాపురం : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర వహిస్తారని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. రామాపురం మండలం గువ్వలచెరువులోని శ్రీ బాలాజీ హైస్కూల్‌లో పాఠశాల 13వ వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణగా చదువుకున్నపుడు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో వీఆర్ పాఠశాల అధినేత వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, వశిష్ట హైస్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెహానో మాబి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీ సమస్యల పరిష్కారానికి కృషి

మండలంలోని క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డికి రామాపురం మండలానికి చెందిన సీఆర్‌పీలు వినతిపత్రం సమర్పించారు. చాలా రోజులుగా తమ సమస్యలు పరిష్కారం కాలేదని వారు తెలిపారు. వెంటనే స్పందించిన రామచంద్రారెడ్డి సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, కొల్లం గంగిరెడ్డి తదితరులు

పుల్లంపేట : పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జాగువారిపల్లి సచివాలయ పరిధిలోని జాగువారిపల్లి గ్రామంలో వారు గడప గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు వారికి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలకు, పార్టీలకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారన్నారు. గాంధీజీ కన్న కలలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి సహకారం చేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, సారథి, మల్లికార్జునరెడ్డి, నరసింహరెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, సిద్దారెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అధికారులు

ఓబులవారిపల్లె : నాడు – నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నాడు – నేడు పనులపై ఎంపీడీఓ విజయారావు, ఎంఈఓ పద్మజ, పాఠశాల ఉపాధ్యాయులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయారావు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాడు – నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని, వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంకల్లా పనులన్నీ వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఎంఈఓ పద్మజ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



బావి నుంచి పూడిక తీస్తున్న దృశ్యం

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పరిసర ప్రాంతాలకు తాగునీరు అందించే మారా రెడ్డి సీపీడబ్ల్యూ స్కీమ్ పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ తెలిపారు. చెయ్యేరు నదిలో బావి ఏర్పాటు చేసి గతంలో తాగునీరు అందించేవారు. గత వరదలలో బావిలోకి ఇసుక చేరడంతో ఫిల్టర్ పాయింట్ వేసి తాగునీరు అందించేవారు. వేసవి ముందుకు వస్తుండటంతో ఫిల్టర్ పాయింట్‌లో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో గత వారంరోజులుగా సీపీడబ్ల్యూ స్కీమ్ నీటిని ప్రజలకు అందించలేకపోయారు. నదిలోవేసిన బావిలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. పూడిక తీసిన తరువాత బురదనీటిని బయటకు పంపించి తరువాత తాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు. శనివారం రాత్రి నుంచి తాగునీటిని కొన్ని గ్రామాలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ స్కీమ్ ద్వారా 24 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

స్తంభాలు.. సరిచేయరు



ఒక వైపు ఒరిగిఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాలు

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి – లక్కిరెడ్డిపల్లె మార్గమధ్యలోని దాసిరెడ్డి మిట్టకు దిగువభాగంలో రోడ్డు పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాలు ప్రమాదపుటంచున రోడ్డువైపు ఒరిగి ఉండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు ఎక్కడ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. రాయచోటి – వేంపల్లి రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల వరకు మట్టిని తొలగించడంతో స్తంభాలు రోడ్డు పక్కకు ఒరగడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. నిత్యం అటువైపు వెళ్తూ ఉండే ట్రాన్స్‌కో సిబ్బంది సైతం ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వాహనదారులకు ప్రమాదం జరుగకమునుపే అధికారులు మేల్కొని ఒరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించేందుకు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సారా స్వాధీనం

కేవీపల్లె : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి, సీఐ గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని జిల్లేళ్ల మంద తండా పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తండాకు చెందిన రెడ్డినాయక్‌ను అరెస్ట్ చేసి అతని వద్దనుంచి సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 400 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీ నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతం చేయండి

ములకలచెరువు: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేయాలని డీపీఓ ధనలక్ష్మి పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం డీపీఓ మండలంలోని కదిరినాథునికోట, వేపూరికోట సచివాలయం, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు, సిబ్బంది పనితీరుపై చర్చించారు. అనంతరం వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లె అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, చిన్నారులతో మాట్లాడారు.

సమతుల ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి

వైవీయూ : సమతుల్య ఆహారం, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంకాల్ నాగరాజు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా కడప నగరంలోని నిరంజన్ నగర్‌లో సమతుల్య ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి పౌష్టికాహారం తినడం ద్వారా ఆరోగ్యం సొంతమవుతుందని వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు యంత్రాలు కాదు

కడప ఎడ్యుకేషన్: విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను పని యంత్రాలుగా భావించడం ప్రభుత్వం మానుకోవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో కూడా ఉపాధ్యాయులకు వివిధ రకాల పనులను అప్పగించి వాటిని పర్యవేక్షించాలని చెప్పడం నిరంకుశ ధోరణికి అద్దం పడుతోందన్నారు.

జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరణ చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ వెంకట జనార్దన్ రెడ్డి అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోనందుకు నిరసనగా మే డే రోజున విశాఖపట్నంలో సీపీఎస్ రద్దు దీక్ష తలపెట్టామన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు రాహుకాల పూజల విశిష్టతను వివరించారు.

విస్తృతంగా జగనన్న నువ్వే మా భవిష్యత్తు



పథకాలపై ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు

రాజంపేట టౌన్ : ప్రజల మోముల్లో చిరునవ్వులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1, 29వ వార్డుల్లో శుక్రవారం జగన్ నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు నవరత్నాల పథకాల వల్ల కలిగిన ప్రయోజనం గురించి తెలియజేశారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను జగన్ 98 శాతం నెరవేర్చారన్నారు. అందువల్లే జగన్ ఎక్కడ ఏ కార్యక్రమం తలపెట్టినా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాసటగా నిలుస్తున్నారని, ఇదే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయానికి సంకేతమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్ న్యామతుల్లా, నూరి, సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు అబ్దుల్ మునాఫ్, తోట లక్ష్మినారాయణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ కమిటీ ఎంపిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్ : నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ మొదటి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జయప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా పి.మహదేవ్, కోశాధికారిగా పి. వెంకటసుబ్బయ్య, కో చైర్మన్‌గా సిజి ప్రతాప్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా యు. ఆనందబాబు, పి. గంగాధర, కె. రెడ్డెప్ప, సహాధ్యక్షులుగా ఎం. రమేష్, ఎం. రామ్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాయచోటి ఎన్‌జీఓ హోంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం రాష్ట్ర చైర్మన్ బి. సేవానాయక్, కో– చైర్మన్ కె. రాఘవరావు, సెక్రటరీ జి. రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్ లోకనాథం, గుంటూరు జిల్లా చైర్మన్ రాజమోహన్, పుట్టపర్తి చైర్మన్ సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

పశుసంవర్ధక సహాయకుల సంఘం ఎన్నిక

అలాగే అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక సహాయకుల సంఘం ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలలో నూతన అధ్యక్షుడిగా సి.గణేష్, అసోషియేట్ అధ్యక్షుడిగా హేమసుందర్‌రెడ్డి, సెక్రటరీగా ఎస్.గురురాజు, ఉపాధ్యక్షులుగా పి.ప్రియాంక, సి.రాజేంద్ర, కె.శంకర్, జాయింట్ సెక్రటరీలుగా ఐ.వరప్రసాద్, జి.ప్రసాద్‌లు, కోశాధికారిగా బి.శిరీషలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'గ్రానైట్ క్వారీకి అనుమతులున్నాయా'



క్వారీ వద్ద మేనేజర్ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి

సిద్దవటం : మూలపల్లె సరిహద్దు కొండ ప్రాంతంలో ఉన్న గ్రానైట్ క్వారీకి అనుమతులు ఉన్నాయా అని సిద్దవటం జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. మండలంలోని మూలపల్లె గ్రామ సమీపంలో ఉన్న గ్రానైట్ క్వారీని శుక్రవారం ఆయన సందర్శించారు. జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి క్వారీ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతూ గ్రానైట్ క్వారీ చాలా కాలం నుంచి నిర్వహిస్తున్నారని, పైగా పరిమితికి మించి తవ్వకాలు చేస్తున్నారని అడిగారు. క్వారీకి సంబంధించిన అనుమతులు ఉన్నాయంటూ రెండు రోజులు గడువు ఇస్తే వాటి చూపిస్తామని మేనేజర్ తెలిపాడు. క్వారీ కారణంగా చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములు సరిగ్గా పండటం లేదన్నారు. రాత్రి వేళల్లో గ్రానైట్ బ్లాస్టింగ్ చేస్తుండటంతో పేలుడుకు గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటిస్తూ తవ్వకాలు చేయాలని క్వారీ యాజమాన్యానికి సూచించారు. మూలపల్లె సర్పంచ్ ప్రతినిధి ఆవుల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా శ్రద్ధ చూపాలి



సర్పంచ్ చిదంబరంరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని గ్రామాలలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అధికారులు తెలుపుతున్న క్రమంలో గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అసైన్‌మెంట్ భూములకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న రైతులకు త్వరితగతిన పట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం ఉపాధి, ఐసీడీఎస్, విద్యుత్, వైద్య, విద్య తదితర శాఖల అభివృద్ధి పనులను అధికారులు సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, జెడ్పీటీసీ కవిత, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు, తహసీల్దార్ మహేశ్వరిబాయ్, ఎంపిడీ నరసింహులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌కు సత్కారం

ఈ నెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన గుట్టపల్లె సర్పంచ్ చిదంబరంరెడ్డిని ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం అనంతరం సత్కరించారు. గుడ్‌మార్నింగ్ గుట్టపల్లె అనే కార్యక్రమం ద్వార గ్రామంలోని పలు సమస్యలను తెలుసుకొని గ్రామాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఫలితంగా ఉత్తమ సర్పంచ్‌గా జిల్లా అధికారులు చిదంబరంరెడ్డిని ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఉత్తమ సర్పంచ్‌ను మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.


అన్నదానం మహాపుణ్యకార్యం



అన్నదానంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు

రామాపురం : గత ఆరు రోజుల నుంచి మండలంలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం మండలంలోని సుద్దమళ్ల గ్రామం దేవలంపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ నాగిరెడ్డి, నాగేంద్రకుమార్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబులు హాజరయ్యారు. పలువురు భక్తులకు వారు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర యువజన విభాగపు జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి, చిన్నరెడ్డి, భక్త, వీరబల్లి ప్రసాద్‌బాబు, అమరనాథరెడ్డి, బొంకు సుబ్బాయి, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయండి



తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డికి డిమాండ్లు తెలియజేస్తున్న బీకేఎంయూ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : అర్హులైన నిరుపేదలందరికీ ఈ నెల 20వ తేదీలోపు అసైన్డ్ భూములు పంపిణీ చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ పండుగోల మణి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి గుడిసె నరసింహులు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణ దేవరలు మాట్లాడుతూ ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాలు 8వ విడత అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పంచాలన్నారు. అనంతరం తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీకేఎంయూ ఉపాధ్యక్షుడు సేలం, సహాయ కార్యదర్శి కె.రవి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభువు మాటలను అనుసరిస్తే జీవితం మహోన్నతం



క్రైస్తవులనుద్దేశించి మాట్లాడుతున్న ఆకేపాటి

– జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ప్రభువుకు ఇష్టంగా జీవించినప్పుడే మనిషి సన్మార్గం వైపు పయనించగలదని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రాజంపేట మండలం తుమ్మల అగ్రహారంలోని అఖిల భారత బేతేలు చర్చి 27వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి ఆ చర్చి ఫాస్టర్ మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో ఆకేపాటి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథరెడ్డి క్రైస్తవులనుద్దేశించి మాట్లాడారు. ఎవరైతే చెడును విసర్జించి లోకంలోని మలినం అంటకుండా పవిత్రమైన జీవితాన్ని గడుపుతారో వారికి జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ప్రభువు పరిష్కరిస్తాడని తెలిపారు. ఏసు చెప్పిన మాటలను అనుసరిస్తే మనిషి మహోన్నతుడు కాగలడన్నారు. అంతేకాక సమాజంలో శాంతి వర్ధిల్లగలదన్నారు. బేతేలు చర్చి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు అరిగెల సౌమిత్రిచంద్రనాథ్, దాసరి పెంచలయ్య, జీవీ.సుబ్బరాజు, జాకీర్‌అహమ్మద్, ఎమ్మార్పీఎస్ నాయకులు బొజ్జా పెంచలయ్య, బాబు పాల్గొన్నారు.

లోకోస్ యాప్ నమోదుపై అవగాహన

మదనపల్లె : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా సమాఖ్యలకు సంబంధించి ఒకే అకౌంటింగ్ విధానం ఉండాలని కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను రూపొందించిందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో మదనపల్లె డివిజన్ పరిధిలోని 11 మండలాల ఏపీఓ, ఏపీఎం, సీఓలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా సమాఖ్యల్లో సరికొత్త అకౌంటింగ్ విధానాన్ని తీసుకువచ్చే భాగంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకువచ్చిన లోకోస్ యాప్ నమోదుకు సంబంధించి మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కొత్త విధానంలో అకౌంటింగ్ సిస్టంను ఏ విధంగా ఎంట్రీ చేయాలనే విషయమై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం–ఐబీ వేణుమాధవ్, లక్ష్మీప్రసాద రెడ్డి, రూతు, ఏపీఎం సురేష్, ఏపీఓ, సీఓ, సంఘమిత్రలు పాల్గొన్నారు.